ప్రజారవాణా విస్తరణకు చర్యలు

- వర్షం పడినా ఇబ్బంది లేకుండా ప్రధాన రోడ్ల నిర్మాణం
- కేంద్రం సహకరించకపోయినా అభివృద్ధిలో ముందుకే..
- శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో మంత్రి కెటిఆర్
- రూ.466 కోట్లలో ఫ్లైఓవర్ నిర్మాణం


నమూనాని పరిశీలిస్తున్న మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహానగరంలో ప్రజా రవాణా విస్తరణకు చర్యలు తీసుకుంటామని పురపాలక, ఐటీ శాఖ మంత్రి కెటి రామారావు చెప్పారు. గచ్చిబౌలి వద్ద రూ.466 కోట్లతో 2.81 పొడవుతో నిర్మించిన శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్‌ను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఎంఎంటిఎస్, మెట్రోరైలు, ఆర్‌టిసి విస్తరణకు పూర్తి ప్రణాళికతో ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి కెసిఆర్ ఎంఎంటిఎస్ అభివృద్ధికి రూ.200 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. రెండో విడతలో మొత్తం 63 కిలోమీటర్ల మెట్రోరైలు విస్తరణ చేయనున్నట్టు చెప్పారు. బిహెచ్ఇఎల్ నుంచి లక్డికాపూల్ వరకు 26 కిలోమీటర్లు, నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు మరో ఐదు కిలోమీటర్లతోపాటుగా మైండ్‌స్పేస్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 32 కిలోమీటర్ల పొడవుతో మెట్రోరైలు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహాయనిరాకరణ చేస్తోందని, కేంద్రం సహకరించినా, సహకరించకపోయినా ప్రజా రవాణా అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. ఎస్ఆర్‌డిపి సిఎం కెసిఆర్ మానసపత్రిక అని, విశ్వనగరంగా ఎదిగేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఎస్ఆర్‌డిపి పథకాన్ని జిహెచ్ఎంసికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలకు అప్పజెప్పినట్టు చెప్పారు. రూ. ఎనిమిది వేల కోట్లతో ఈ పథకాన్ని చేపట్టాలని రూపకల్పన చేసి 48 పనులను చేపట్టగా.. ఇప్పటికే 33 పనులు పూర్తిచేసినట్టు, మిగతా పనులు త్వరలో పూర్తి చేస్తామని అన్నారు. ఇక్కడ ఉన్న సదుపాయాలు దేశంలోని మెట్రో నగరాలు అయిన చెన్నై, బెంగళూరు, ముంబాయి, కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్‌లో లేవన్నారు. రోజురోజుకూ పరిశ్రమ, ఐటి రంగం విస్తరణ పెరగడంతో ఏడాదికి లక్ష కుటుంబాలు స్థిరపడుతున్నాయని, ఒకే ప్రాంతంలో కాకుండా హైదరాబాద్ నలుమూలలు విస్తరించడంతోపాటు అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఎస్ఆర్‌డిపి రెండో దశలో రూ.3,500 కోట్లతో చేపట్టనున్నట్టు తెలిపారు. వర్షం పడినా ఇబ్బంది కలుగకుండా ప్రధాన రోడ్లను సిఆర్ఎంపి ద్వారా చేపట్టినట్టు చెప్పారు. రేపటి అవసరాల కోసం మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసినా జనాభాకు అనుకూలంగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

ఈ ప్రాంతంలో స్టేజ్-2 ద్వారా గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు థర్డ్ లేవల్ బ్రిడ్జిని మరో పది నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, కొత్తగూడ ఫ్లైఓవర్‌ను డిసెంబర్ చివరికిగానీ వచ్చే ఏడాది మొదటి వారంలోగానీ ప్రారంభిస్తామని తెలిపారు. గోపన్‌పల్లి ఫ్లైఓవర్‌నూ పూర్తి చేసేందుకు మంత్రి ప్రశాంత్‌రెడ్డిని కోరుతామని తెలిపారు. ఈ ఫ్లైఓవర్‌కు అండర్‌పాస్ నిర్మాణాన్ని రూ.20కోట్లతో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. రవాణా వ్యవస్థతోపాటు గ్రీనరీ అభివృద్ధికి పది శాతం బడ్జెట్‌ను కేటాయించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. బల్దియా అధికారులు అద్భుతంగా పనిచేస్తున్నారని కొనియాడారు. రానున్న రోజుల్లో జిహెచ్ఎంసి ద్వారా చేపట్టిన అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా రవాణాను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ అరికెపూడి గాంధీ, స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ ఆలె వెంకటేశ్వర్‌రెడ్డి, టిఎస్ఐఐసి చైర్మెన్ బాలమల్లు, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, సురభివాణీదేవి, డిప్యూటీ మేయర్ శ్రీలత, చీఫ్ ఇంజినీర్ దేవానంద్, ఎస్ఈ వెంకటరమణ, డీఈ హరీష్, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి, షేక్‌హమీద్ పాల్గొన్నారు.

నేటి నుంచి టిఎస్‌జిపిఇడబ్ల్యుయు నాలుగో మహాసభ

- వేలాదిగా తరలిరానున్న గ్రామపంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి -హైదరాబాద్

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నాలుగో రాష్ట్ర మహాసభ జరుగనుంది. 26న మధ్యాహ్నం 12:30 గంటలకు నాగర్‌కర్నూల్‌లోని లహరి గార్డెన్ నుంచి జెడ్‌పి హైస్కూల్ గ్రౌండ్ వరకు గ్రామపంచాయతీ కార్మికులు భారీ ప్రదర్శన చేపట్టనున్నారు. ఆ తర్వాత జెడ్‌పి హైస్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఉంటుంది. ప్రదర్శనలో మహిళా బృందం ముందుభాగంలో నడువనుంది. మహాసభ అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభమై ఆదివారం వరకు కొనసాగనుంది. ఈ మహాసభకు 400 మంది ప్రతినిధులు రానున్నారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి పి జయలక్ష్మి, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరెడ్డి, చాగంటి వెంకటయ్యా పాల్గొననున్నారు. జిపి కార్మికులకు ప్రస్తుతం అందుతున్న రూ.8,500 వేతనాన్ని సాధించడంలో టిఎస్‌జిపిఇడబ్ల్యుయు పాత్ర మరువలేనిది. అయితే, పెరిగిన నిత్యావసర ధరలు, ఇతరత్రా ఖర్చుల నేపథ్యంలో ఈ వేతనాలు సరిపోవు వారికి కనీస వేతనాలు ఇవ్వడంతోపాటు పర్మినెంట్ చేయాలని నిఖరంగా పోరాడుతుంది. మల్టీపర్పస్ విధానం రద్దు, జిఒ నెంబర్ 51 సవరణ కోసం రాజీలేని పోరాటం చేస్తోంది. జిపిల్లో పనిచేసే కలం కార్మికులైన కారోబార్లు, బిల్‌కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించాలని రాష్ట్ర సర్కారుతో కొట్లాడుతోంది. జిపి కార్మికుల సమస్యలపై ఇప్పటికే ఒకసారి ప్రగతిభవన్‌నూ ముట్టడించిన సంగతి తెలిసిందే. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో టిఎస్‌జిపిఇడబ్ల్యుయు పోరాటాల వల్ల కొన్ని విజయాలు సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మున్సిపాలిటీల్లోని కార్మికులకు ఇస్తున్న వేతనాన్ని జిపి కార్మికులకూ ఇవ్వాలనీ, ఒకే పనిచేసేవారికి వేతనాల్లో తేడా ఎందుకు అని రాష్ట్ర సర్కారుపై ఒత్తిడి పెంచుతోంది. గ్రామ పంచాయతీల నిధులను సకాలంలో ఇవ్వాలనీ, కార్మికుల వేతనాలను ప్రభుత్వమే వారి ఖాతాల్లో వేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సర్కారును ఎప్పటి నుంచో కోరుతున్నది. హక్కుల కోసం, కనీస వేతనాల కోసం రాజీలేని పోరాటాలు చేస్తూ గ్రామపంచాయతీ కార్మికుల ఆదరాభిమానాలను చూరగొంటోంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఆ యూనియన్ రాష్ట్ర మహాసభలకు ప్రత్యేకత నెలకొంది. రాష్ట్ర నలుమూలల నుంచి బహిరంగ సభకు వేలాది మంది కార్మికులు తరలిరానున్నారు. మహాసభలో గ్రామ పంచాయతీ కార్మికుల కోసం చేయాల్సిన భవిష్యత్ పోరాటాల కార్యాచరణ, గత మహాసభ నుంచి నేటి వరకు చేసిన పోరాటాలపై ప్రధానంగా చర్చ నడువనుంది.


మంత్రి హరీశ్‌రావును కలిసిన పిఆర్‌టియు నేతలు

ఎయిడెడ్ టీచర్ల వేతనాలు విడుదల చేయాలి

- టిఎస్‌యుటిఎఫ్, పిఆర్‌టియు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎయిడెడ్ ఉపాధ్యాయుల గతనెల వేతనాలు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సప్లిమెంటరీ (అనుబంధ) వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత రెండేండ్లుగా వేతనాలు ప్రతి నెల మొదటి తేదీన ఇవ్వటం లేదని తెలిపారు. సప్లిమెంటరీ బిల్లులు, సెలవు వేతనాలు, జిపిఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పిఆర్‌సి, డిఎ బకాయిలు, విశ్రాంత ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర బిల్లులు ట్రెజరీల్లో ఆమోదం పొంది నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక సందర్భాల్లో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని కలిసి ప్రాతినిధ్యాలు చేసినప్పుడు పాక్షికంగా కొన్ని బిల్లులు మంజూరవుతున్నాయని పేర్కొన్నారు. ఇంకా అనేక బిల్లులు పెండింగ్‌లోనే ఉంటున్నాయని తెలిపారు. అవసరాలకు డబ్బు సర్దుబాటు కాక పలువురు ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులన్నింటినీ తక్షణమే విడుదల చేయాలనీ, బకాయిల చెల్లింపునకు నిర్దిష్ట గడువు విధించి టోకెన్ నెంబర్ల ప్రకారం నిధులు చెల్లించాలని కోరారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన పిఆర్‌టియు

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని పిఆర్‌టియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావును శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎం అంజిరెడ్డి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సరెండల్ లీవులు, జిపిఎఫ్ తుది చెల్లింపులు, జీవిత బీమా, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటి బిల్లులు ఆర్థిక శాఖలో ఆమోదం కోసం ఉన్నాయని వివరించారు. ఉపాధ్యాయుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఈ బిల్లులను మంజూరు చేయాలని కోరారు. వాటిని వెంటనే మంజూరయ్యేలా చూస్తానంటూ మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు తెలంగాణ రాష్ట్ర కోశాధికారి చంద్రశేఖర్‌రావు, సంగారెడ్డి అధ్యక్షులు అబ్దుల్లా, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, పత్రికా సంపాదకులు వెంకట్‌రెడ్డి, నాయకులు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

6,129 కొనుగోలు కేంద్రాలు

- మంత్రి గంగుల కమలాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 6,129 కొనుగోలు కేంద్రాల ద్వారా 26లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేయనున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ శుక్రవారం హైదరాబాద్‌లో వెల్లడించారు. ఈ ప్రక్రియ సజావుగా జరుగుతుందన్నారు. ఇప్పటికే 35 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలోని 4 లక్షల 16వేల మందికి పైగా రైతుల వద్దనుంచి సేకరించి, ఈ ధాన్యాన్ని మిల్లులకు చేరవేస్తున్నామని తెలిపారు. మిల్లర్లు గుర్తించిన విలువ రూ.2,390 కోట్లకు గానూ రూ.2,154 కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు.

సాధారణంగా నవంబర్, డిసెంబర్ మాసాల్లోనే అధికంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందనీ, అందుకనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గన్నీలు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, ప్యాడీక్లీనర్లు సమకూర్చామనీ, ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందని మంత్రి తెలిపారు.

పెరుగుతున్న చలి

- వచ్చే మూడ్రోజుల్లో సున్నా డిగ్రీల లోపే !
- సిర్పూర్‌లో అత్యల్పంగా 11.5 డిగ్రీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నవంబర్‌లోనే చలి వణుకు పుట్టిస్తున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పులులే కాదు చలి కూడా పంజా విసురుతున్నది. శుక్రవారం కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో అత్యల్పంగా 11.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఆదిలాబాద్ జిల్లా భోరజ్‌లో 11.8, బేలలో 11.9, భరమ్‌పూర్‌లో 12.5, జైనథ్‌లో 12.6, రామ్‌నగర్(ఏఆర్ఎస్)లో 12.7, పిప్పల్‌దరిలో 12.8, నేరడిగొండలో 12.9, చాప్రాల్‌లో 13.0, కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో 13.7 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా సంస్థ వాతావరణ బులిటెన్‌లో పేర్కొంది.

వచ్చే మూడ్రోజుల్లో కొమ్రంభీమ్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 10 నుంచి 8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తూ ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. తెలంగాణలో ఈశాన్య, తూర్పు దిశల నుంచి చల్లని గాలులు వీస్తున్నాయి.

దేశాన్ని అమ్ముతున్న మోడీని గద్దె దించాలి

- సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బావుటా ఎగరెసిన ప్రజానాట్యమండలి
- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి
- రాష్ట్ర 4వ వీధి నాటకోత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశాన్ని అమ్ముతున్న మోడీని తక్షణమే గద్దె దించాల్సిన అవసరం ఉందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిర్యాలగూడ జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. 27, 28, 29 తేదీల్లో నల్లగొండలో జరగనున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర రెండో మహాసభ నేపథ్యంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర నాలుగో వీధి నాటకోత్సవాలు శుక్రవారం ఎన్‌జి కళాశాలలో ప్రారంభమయ్యాయి. సఫ్దర్ హష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి 2022-షాట్‌ను నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి జూలకంటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించకుండా బడాబాబుల జేబులు నింపుతోందని విమర్శించారు.

రైతులకు న్యాయం చేయని, కార్మికులకు కష్టాలు తెచ్చిన ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బావుటా ఎగురవేసింది ప్రజానాట్యమండలేనని చెప్పారు. 70 ఏండ్ల ఘన చరిత్ర కలిగిన ప్రజా సాంస్కృతికోద్యమ సంస్థగా, రెండో ప్రపంచ యుద్ధ కాలంలోనే ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ఇండియన్ పీపుల్స్ థియేటర్ (ఇప్టా)కు వారసురాలిగా ఏర్పడిన ప్రజానాట్యమండలి కళ కళకోసం కాదు, కళ ప్రజల కోసం అని చాటి చెప్పిందన్నారు. తెలుగునాట ప్రజా సాంస్కృతికోద్యమ సారథిగా ప్రజానాట్యమండలి పనిచేస్తుందని చెప్పారు.

సారా వ్యతిరేక ఉద్యమం, మద్యంపై యుద్ధం పేరుతో వేలాది కళా ప్రదర్శనలతో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసిందన్నారు. శ్రీశ్రీ, గురజాడ, వేమన, కందుకూరి, జాషువా, వీరబ్రహ్మం వంటి సంఘ సంస్కర్తల భావజాలాన్ని, వారి రచనల సందేశాన్ని కళారూపాలుగా మలచి పల్లెల్లో, పట్టణాల్లో వాడవాడలా విస్తృత ప్రచారాన్ని నిర్వహించిందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు పోరాట చరిత్రను వీధినాటికగా మలచి వందలాది ప్రదర్శనలిచ్చింది ప్రజానాట్యమండలి అని చెప్పారు. దళిత, ఆదివాసుల హక్కుల రక్షణ కోసం, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ప్రచార జాతాల్లో వందలాది మంది కళాకారులతో ప్రదర్శనలు చేశారని తెలిపారు.

ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమ బాట నడిచిన సఫ్దర్ హష్మి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ అడుగు వేయాలని సూచించారు. కేంద్రంలో మోడీని గద్దె దింపేందుకు కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో చేతులు కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డమీద మతోన్మాద శక్తులకు స్థానం కల్పించొద్దని ప్రజలను కోరారు.

కేంద్ర ప్రభుత్వం కార్మికుల పొట్టలను కొట్టే చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. 2024 ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పి రైతాంగాన్ని రక్షించుకోవాలన్నారు.

ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పరిశోధకులు అనిత, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబరాజు యాదగిరి, అవ్వారు గోవర్ధన్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కొండూరు భాస్కర్, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున, ఆవాజ్ రాష్ట్ర నాయకులు సయ్యద్ హాషం తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శించిన కళారూపాలు

కళారూపాల సమన్వయకర్త సాంబరాజు యాదగిరి ఆధ్వర్యంలో అల్లా బోల్, డెమోక్రసీ, రైతు బతుకు ఒగ్గు కథ, చిరుతల కథ, గోసంగి, వీర తెలంగాణ నాటికలను ప్రదర్శించారు.

డప్పు వాయిద్యాలతో భారీ ర్యాలీ

తెలంగాణ రైతు సంఘం మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అన్ని జిల్లాల నుంచి కళాకారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చల్లప్ప కమిషన్ సిఫార్సులపై మంత్రుల భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చెల్లప్ప కమిషన్ చేసిన సిఫార్సుల ప్రకారంగా వాల్మీకి బోయకులాలను ఎస్‌టి కులాల జాబితాలోకి మార్చాలన్న సిఫార్సులపై రాష్ట్ర మంత్రులు డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్, ఇంద్రకరణ్ రెడ్డి, శాసన సభ్యులు బండ్ల కష్ణమోహన్ రెడ్డి, డాక్టర్ అబ్రాహం, న్యాయ శాఖ ప్రభుత్వ కార్యదర్శితో కలిసి హైదరాబాద్ లో న్యాయశాఖ మంత్రి కార్యాలయంలో న్యాయపరమైన అంశాలపై చర్చించారు. ప్రస్తుతం ఎస్‌టి జాబితాలో ఉన్న కులాలకు ఇబ్బందులు లేకుండా బిల్లు శాసన సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందెలా కృషి చేయాలనీ, ఆ తర్వాతనే కేంద్ర ప్రభుత్వ సిఫార్సులకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రులు న్యాయ శాఖ అధికారులను ఆదేశించారు.

గ్రూప్-4 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

రాష్ట్రంలో మరోసారి కొలువుల జాతర కొనసాగనుంది. గ్రూప్-4 పోస్టుల భర్తీకి వీలుగా ప్రభుత్వం అనుమతులనిచ్చింది. మొత్తం 9,168 ఖాళీల భర్తీకి అనుమతిస్తూ ఆర్థికశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టుల భర్తీ ప్రక్రియను టిఎస్‌పిఎస్‌సికి అప్పగించారు. జీవోల్లో పేర్కొన్నదాని ప్రకారం... గ్రూప్-4 ఉద్యోగాలను నాలుగు కేటగిరీలుగా విభజించారు. 429 జూనియర్ అకౌంటెంట్ పోస్టులు, 6,859 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, 18 జూనియర్ ఆడిటర్ పోస్టులు, 1,862 వార్డు ఆఫీసర్ పోస్టులు వాటిలో ఉన్నాయి. ఆర్థికశాఖలో 191, పురపాలకశాఖలో 238 జూనియర్ అకౌంటెంట్ పోస్టులున్నాయి. ఇక జూనియర్ అసిస్టెంట్ పోస్టులను పరిశీలిస్తే... వ్యవసాయశాఖలో 44, బీసీ సంక్షేమశాఖలో 307, పౌరసరఫరాల శాఖలో 72 ఉన్నాయి. అటవీశాఖలో 23, ఆర్థికశాఖలో 46, వైద్య-ఆరోగ్యశాఖలో 338, ఉన్నత విద్యాశాఖలో 742 జూనియర్, హోం శాఖలో 133, నీటిపారుదల శాఖలో 51, కార్మికశాఖలో 128, మైనార్టీ సంక్షేమశాఖలో 191 జూనియర్ అసిస్టెంట్ పోస్టులున్నాయి. పురపాలక శాఖలో 601, పంచాయతీరాజ్ శాఖలో 1,245, రెవెన్యూశాఖలో 2,077, ఎస్సీ అభివద్ధి శాఖలో 474 జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు సర్కారు పచ్చ జెండా ఊపింది. సెకండరీ విద్యాశాఖలో 97, రవాణాశాఖలో 20, గిరిజన సంక్షేమ శాఖలో 221, మహిళా, శిశు సంక్షేమ శాఖలో 18, యువజన సర్వీసుల శాఖలో 13 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కూడా భర్తీకానున్నాయి.

అటవీ సిబ్బందికి మద్దతుగా నిలవండి

ఎస్‌పిలకు డిజిపి మహేందర్‌రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్షేత్రస్థాయిలోని అటవీ ఉద్యోగులకు, సిబ్బందికి మద్దతుగా నిలవాలనీ, భరోసా కల్పించాలని పోలీసు శ్రేణులకు డిజిపి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం లాంటి ఘటనలను పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పోలీసు ఉన్నతాధికారులు, ఎస్‌పిలతో డిజిపి మహేందర్‌రెడ్డి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో పిసిసిఎఫ్, హెచ్ఓఎఫ్ ఆర్ఎం డోబ్రియల్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ...విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. తమ పరిధిలోని చీఫ్ కన్జర్వేటర్లు, జిల్లా అటవీ అధికారులతో స్వయంగా సమావేశం కావాలని పోలీసు కమిషనర్లు, ఎస్‌పిలు, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశారు. వారు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యను తెలుసుకుని పరిష్కరించేలా చూడాలని సూచించారు.

యుఎల్‌సి భూములపై గద్దలు!

- ఎకరాలకెకరాలు కబ్జా
- జిఒ 59 కింద రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తులు
- రూ.50 వేల కోట్ల విలువైన స్థలాలు
- పట్టించుకోని సర్కార్
- గ్రేటర్‌లో ఇదీ పరిస్థితి

పజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయం. పేదోడు గూడు కోసం జానెడు జాగాలో గుడెసేసుకుంటే పీకిపారేస్తున్న రెవెన్యూ అధికారులకు కోట్లాది రూపాయల విలువైన భూముల్లో పెద్దలు పాగా వేస్తే కనిపించడం లేదు. పేదలు అవసరం కోసం ఆక్రమిస్తే అరెస్టులు చేస్తరు.. పెద్దలు వ్యాపారం కోసం ఆక్రమిస్తే చేస్తే పట్టించుకునే నాథుడే కరువు. ఇప్పుడు వారికి జిఒ నెంబర్ 58, 59 ఓ వరంలా మారాయి. జిఒ 59 కింద ఎంత స్థలం వరకు అనే పరిధి విధించకపోవడంతో ఎకరాల కొద్దీ భూమిని క్రమబద్ధీకరించాలంటూ వేలల్లో దరఖాస్తులు పెట్టుకున్నారు. ఇదీ రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోని యూఎల్‌సీ భూముల కబ్జా పరిస్థితి.

గ్రేటర్‌లోని హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో కోట్లాది రూపాయల విలువైన యుఎల్‌సి (పట్టణ ప్రాంతంలో సీలింగ్ భూములు) భూములను దక్కించుకోవడానికి కొందరు దరఖాస్తులు చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లాలో 607 ఎకరాల యుఎల్‌సి భూములను రెగ్యులరైజ్ చేయాలని జిఒ 59 కింద 11,744 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో మల్కాజ్‌గిరి రెవెన్యూ డివిజన్‌లో అత్యధికంగా 7,243 దరఖాస్తులు వచ్చాయి. హైదరాబాద్ జిల్లాలో 4,843 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో హైదరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 707, సికింద్రాబాద్ డివిజన్‌లో 4,136 ఉన్నాయి.

రూ.50 వేల కోట్లపైనే..

గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో రూ.50 వేల కోట్ల విలువైన భూములను కాజేయడానికి పెద్దలు పథకం వేశారు. ఈ భూములను తమకు రెగ్యులరైజ్ చేయాలని ఏకంగా దరఖాస్తులే చేసుకున్నారు. జీఓ 58 కింద 125 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరించాలని, ఆపై స్థలానికి జీఓ 59 కింద రిజిస్ట్రేషన్ విలువలో 50 శాతం చెల్లిస్తే క్రబద్ధీకరించాలని సర్కార్ నిర్ణయించిన విషయం తెలిసిందే. 250 గజాలపైన అన్నారే తప్ప పరిధి అంటూ నిర్ణయించలేదు. ఇదే అదనుగా భావించిన కబ్జాదారులు ఏకంగా ఎకరాల భూమిని సైతం క్రమబద్ధీకరించాలని దరఖాస్తులు పెట్టుకున్నారంటే పైరవీలు, ఏ స్థాయిలో డబ్బులు చేతులు మారుతాయో చెప్పనక్కర్లేదు.

బండ్లగూడ కల్సాలో అహ్మద్ మెమోరియల్ ఎడ్యూకేషన్ సొసైటీ(ఖాజాహసన్) 42.30 ఎకరాలు ఆక్రమించింది. ముఖ్యంగా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్‌లో గజం స్థలానికి కోట్లలో విలువ ఉంటుంది. ఆ ఏరియాలో ఒక్కొక్కరు 1000 గజాలపైనే ఆక్రమించారు. కొండాపూర్‌లో ఎం.రాజుయాదవ్ అనే వ్యక్తి ఏకంగా 3 ఎకరాలు (12000గజాలు), మియాపూర్‌లోని సర్వే నెం.99లో శాకమూరి సుగుణ 8.4 ఎకరాలు, మేరీ యరువ అనే వ్యక్తి శేరిలింగంపల్లి సర్వే నెం.106,107లో 13.31ఎకరాలు, శంషాబాద్ మండలంలోని కొత్వాల్‌గుడలో ఎస్వీ లక్ష్మిదేవి ఎకరం యూఎల్‌సీ స్థలాన్ని ఆక్రమించి రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి.

యుఎల్‌సి భూములను స్వాధీనం చేసుకోవాలి
ఎం.శ్రీనివాస్, సిపిఎం నగర కార్యదర్శి

గ్రేటర్‌లోని ఆక్రమణకు గురైన యూఎల్‌సీ భూములు (పెద్ద కమతాలను) ప్రభుత్వ స్వాధీనం చేసుకోవాలి. ఆ భూములను ప్రజాప్రయోజనాలకు వినియోగించాలి. స్కూళ్లు, కాలేజీలు, మార్కెట్లు, క్రీడామైదానాలు వంటి వాటిని నిర్మించాలి. పేద, మధ్యతరగతి ప్రజలు ఎవరైనా యూఎల్‌సీ భూములను రెగ్యులరైజ్ చేయాలని దరఖాస్తు చేసుకుంటే చేయాలి.

బిజెపి హయాంలో ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం

- ఎంపి రాంజి గౌతమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ రంగాన్నంతా ప్రయివేటీకరించే పనిలో బిజెపి బిజీగా ఉన్నదని బిఎస్‌పి రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ ఎనిమిదేండ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఆదివాసులు, దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోపక్క రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో భవిష్యత్‌లో రాష్ట్రంలో విప్లవం రాబోతున్నదని గుర్తుచేశారు. బిఎస్‌పి రాష్ట్ర నాయకత్వం బలంగా పనిచేస్తున్నదని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బహుజన రాజ్యం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నుంచి బహుజన రాజ్యాధికార యాత్ర ప్రారంభం కానుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఛీఫ్ కో ఆర్డినేటర్ మంద ప్రభాకర్, పసుపుల బాలస్వామి, చంద్రశేఖర్ ముదిరాజ్, అనితరెడ్డి, సదురుల మల్లేశం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్ నుంచి విరాళాల సేకరణ

- అనాథ చిన్నారుల కోసం వినియోగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత సామరస్య ప్రచారం, విరాళాల సేకరణ వారోత్సవం సందర్భంగా ఫ్లాగ్ డేను పురస్కరించుకొని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల భుయాన్, హైకోర్టు జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డిని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ శుక్రవారం కలిసి విరాళం సేకరించారు. నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యూనల్ హార్మనీ ఆదేశానుసారం నవంబర్ 19 నుంచి 25తేదీ వరకు మత సామరస్య ప్రచారం వారోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రజల్లో మతసామరస్యం పట్ల అవగాహన, ఆవశ్యకత, జాతీయ సమైక్యత, సౌభ్రాతృత్వంపై సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు, వర్క్‌షాపులు, వక్తృత్వ, చిత్రలేఖనం తదితర అంశాలను ఏర్పాటు చేసి ఫ్లాగ్ డే సందర్భంగా విరాళాలు సేకరిస్తారు. కుల, మత, ఉగ్రవాద ఘర్షణల్లో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ చిన్నారుల పునరావాసం కోసం ఈ విరాళాలను వినియోగిస్తారు.

హెచ్‌సియు-ఆస్కి ఆధ్వర్యంలో పబ్లిక్ పాలసీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సియు), అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఆస్కి) ఆధ్వర్యంలో పబ్లిక్ పాలసీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయాలని నిర్ణయించాయి. హెచ్‌సియులోని రాజనీతి శాస్త్ర విభాగం నిర్వహిస్తున్న "75 ఏండ్లలో పబ్లిక్ పాలసీ–ఒక పునరావలోకనం"అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సులో భాగంగా శుక్రవారం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధులుగా హెచ్‌సియు వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ బిజె రావ్, ఆస్కి డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ నిర్మాల్య బాగ్చి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాగ్చి మాట్లాడుతూ హెచ్‌సియు, ఆస్కి ఆధ్వర్యంలో పబ్లిక్ పాలసీ బలోపేతానికై కృషి చేస్తామని ప్రకటించారు. అంతే కాకుండా ఆ పాలసీపై పిజి స్థాయిలో ఆన్‌లైన్‌లో కోర్సులు, పాలసీ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి సుముఖతను వ్యక్తం చేసారు. దీనికి బిజె రావు కూడా సానుకూలంగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు సామాన్యుల కేంద్రీకృతంగా ఉండాలని సూచించారు. ఈ జాతీయ సదస్సు కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ వెంకటేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు ప్రజల జీవితాల్లో సమూల మార్పులు తీసుకొచ్చెలా ఉండాలని చెప్పారు. ఈ సదస్సులో ప్రొఫెసర్లు ప్రకాశ్ సి సారంగి, వీరబాబుతోపాటు రాజనీతిశాస్త్ర విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'శాసన సభ' ట్రైలర్ లాంచ్‌కు మంత్రి గంగులకు ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హీరో ఇంద్రసేన తన కొత్త సినిమా శాసనసభ ట్రైలర్ లాంచ్‌కు మంత్రి గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానించారు. ఆదివారం మధ్యాహ్నం బంజారా హిల్స్‌లోని రాడిషన్ బ్లూ హోటల్లో నిర్వహించే ఈ వేడుకల్లో సినీరంగానికి చెందిన ప్రముఖులు నటకిరీటి రాజేంద్రప్రసాద్, 7జి ఫేమ్ సోనీ అగర్వాల్‌తో పాటు ఏపీ మంత్రి రోజా, తుంగతుర్తి ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ తదితరులు హాజరు కానున్నట్టు ఇంద్రసేన ఈ సందర్భంగా తెలిపారు. ప్రతిష్టాత్మక కేజీఎఫ్ చిత్ర సంగీత దర్శకుడు రవి బసూర్ సంగీతం అందించడం విశేషం.

జీతభత్యాలే కాదు చట్టాలను కాపాడుకుంటా..

- సృష్టించిన సంపదలో మనకు వాటా రావాలి
- సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు
- పెరిగిన ధరలకు అనుకూలంగా కనీస వేతనం ఇవ్వాలి
- రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జయలక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జీతభత్యాల కోసమే కాదు.. కార్మికుల మనుగడను ప్రశ్నార్థకం చేసిన పాలకవర్గ విధానాలను ఎండగడుతూ కార్మిక చట్టాలను కాపాడుకుంటామని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు అన్నారు. వనపర్తి జిల్లా మూడో మహాసభను 24, 25 తేదీల్లో కొత్తకోటలో సిఐటియు మండ్ల రాజు అధ్యక్షతన నిర్వహించారు. శుక్రవారం ముగింపు సందర్భంగా జరిగిన భహిరంగ సభలో సాయిబాబు మాట్లాడారు. వనపర్తి జిల్లాలో మూడు లక్షల మంది కార్మికులు కనీస వేతనాలకు దూరంగా ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్లో పనిచేస్తున్న వర్కర్లకు ఏడు నెలల నుంచి వేతనాలు లేకుంటే ఎలా జీవిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మిషన్ భగీరథ కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్న పాలకులను.. అందులో పని చేస్తున్న కార్మికులు వేతనాలు అడిగితే తప్పేంటని ప్రశ్నించారు. మరోవైపు ప్రధాని మోడీకి కార్మికుల సమస్యలు ఏవీ పట్టడం లేదని విమర్శించారు. పేదలు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు తింటున్న మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉండటం సరికాదన్నారు. రుచికరమైన భోజనం పెట్టకుండా భేటీ పడావో అంటూ నినాదాలు ఇవ్వడం బిజెపికే చెల్లిందన్నారు. ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశాలు, అంగన్‌వాడీల సమస్యలు ఎందుకు పరిష్కారం చేయడం లేదని ప్రశ్నించారు. 1977లో వచ్చిన అంగన్‌వాడీ వ్యవస్థలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల చట్టం అమలు చేయాలని కోరారు.



ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని, బంగారు తెలంగాణ దూసుకుపోతుందని చెబుతున్న పాలకులు కార్మికుల జీతభత్యాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రూ. 470 ధర ఉన్న గ్యాస్ ఇప్పుడు రూ. 1100కు పెరగడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యం కాదా అన్నారు. దేశ సంపదకు కారకులైన కార్మికులు, రైతుల పట్ల మోడీ ఎందుకు వివక్ష చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి కార్మికునికీ నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జయలక్ష్మి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను వేధిస్తున్న అధికారులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ జిల్లాలో ఆశా కార్యకర్త చనిపోతే ఆమె కుటుంబానికి సిఐటియు అండగా నిలిచిందని గుర్తు చేశారు. రూ.26 వేల కనీస వేతనంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్ల దాటిన ప్రతి ఒకరికీ పింఛన్ ఇవ్వాలన్నారు. సభలో సిఐటియు వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, నాయకులు మహమూద్, సునీత, రమేష్, శ్రీహరి, గోపాలకృష్ణ, ఎం రాములు, రాము, నిక్సన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకు కేంద్రం కుట్ర

- ఆర్థిక వనరులను కట్టడి చేసే దురాలోచన
- శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాల ఆర్థిక వనరులను కట్టడి చేయాలనే దురాలోచనలో కేంద్రం ఉందన్నారు. ఇది ఫెడరల్ వ్యవస్థకు విఘాతం కలిగించే చర్య అన్నారు. తెలంగాణలో అధికారంలోకి రావడం కోసం బిజెపి ఎంతకైనా తెగించేలా ఉందని విమర్శించారు. కేంద్రం పరిధిలో ఉన్న అన్ని శాఖలతో ఇబ్బంది పెడుతూ వ్యక్తిగత కక్షకు పాల్పడుతుందన్నారు. తెలంగాణకు డబుల్ ఇంజన్ సర్కార్ రావాలంటే అభివృద్ధి చేసి చూపించి ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలన్నారు. అలా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి లబ్ది పొందాలని చూస్తోందని విమర్శించారు. ఐటి, ఇడి, సిబిఐని ఉపయోగించి ప్రతిపక్ష పార్టీల నాయకులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్ధాంత పరంగా కేంద్ర పరిపాలన జరగడం లేదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వాలు ప్రజల మన్నన పొందాలని సూచించారు. జీఎస్‌టిలో రాష్ట్రానికి రావాల్సిన వాటా ఇవ్వడం లేదని చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. తన తనయుడు అమిత్‌రెడ్డికి రాజకీయాలంటే ఆసక్తి ఉందని, రాజకీయాల్లోకి వస్తే తాను వద్దనబోనని చెప్పారు. ప్రజలతో మమేకమై, ప్రజా సంక్షేమానికి పాటుపడేవారికి ఆదరణ ఉంటుందన్నారు. అమిత్ కూడా సరైన అవకాశం చూసుకుని ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తారని తెలిపారు.

ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భూక్య శ్రీనివాస్, రాములు

- 61 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భూక్య శ్రీనివాస్, వంగూరు రాములు, గౌరవాధ్యక్షులుగా తుమ్మల వీరారెడ్డి, కోశాధికారిగా మామిడాల కనకయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 31 మంది ఆఫీస్ బేరర్లు,61 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఆ ఫెడరేషన్ రాష్ట్ర మూడో మహాసభ గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జరిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు వంగూరు రాములు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యక్షులుగా బి.రాములు, యర్రా శ్రీకాంత్, ఎన్.బాలయ్య, బుస్సా మొగిసి, మర్రి ఎల్లయ్య, కత్తుల యాదయ్య, తిరుపతి రాంమూర్తి, పి.చెన్నయ్య, కూరెళ్లి రాములు, చంద్రకాత్, బందుసాయిలు ఎన్నియ్యారు. రెండు కో–ఆప్షన్స్ ఉన్నాయి. రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా పాలడుగు సుధాకర్, యాటల సోమన్న, రాగుల రమేష్, యు.శ్రీనివాస్, ఎల్లారెడ్డి, శ్రీనివాస్, గోపాలస్వామి, పుట్ట ఆంజనేయులు, వెంకటస్వామి, యాదగిరి, దండేపల్లి సత్తయ్య, ఎం.వీరయ్య, రాపర్తి రాజు ఎన్నికయ్యారు. హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలనీ, కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వంగూరు రాములు డిమాండ్ చేశారు.

దగాపడుతున్న 'అన్నదాతలు'

- పెరిగిన పెట్టుబడులు– తగ్గిన దిగుబడులు
- రేపటి నుంచి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ రంగంలో వస్తున్న సమస్యలపై సమరశీలంగా పోరాటాల నిర్వహించేందుకు అఖిల భారత కిసాన్ సభ ముందుండి పోరాడుతుంది. తెలంగాణ వ్యాప్తంగా 60 లక్షల మంది రైతులు ఉండగా.. ఐదు లక్షల మంది సభ్యులతో తెలంగాణ రైతు సంఘం సభ్యత్వం పొంది. రైతులకు అండగా నిలిచి ఉద్యమాలు సాగిస్తోంది. నల్లగొండ జిల్లా కేంద్రంలో 27వ తేదీ నుంచి 29 తేదీ వరకు జరగనున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర రెండో మహాసభలో రైతాంగ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఇప్పటివరకు చేపట్టిన ఉద్యమాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నారు.

మార్కెట్లో దొరికే ప్రతి వస్తువుకూ యజమానే ధర నిర్ణయిస్తాడు.. ఆయన నిర్ణయించిన ధరకే వినియోగదారుడు కొనుక్కోవాలి. కానీ రైతు పండించిన పంటకు మాత్రం ధర నిర్ణయించే అధికారం రైతులకు ఉండదు.. వ్యాపారస్తులు సూచించిన ధరకే పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి సమాజంలో నెలకొంది. భూమిని నమ్ముకొని కాయకష్టం చేస్తున్న అన్నదాత ప్రతి సీజన్‌లోనూ నష్టపోతున్నాడు. పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన దిగుబడుల కారణంగా.. స్థిరీకరమైన ధరలు లేకపోవడంతో అన్నదాతలు అప్పుల పాలవుతున్నారు. పంట రుణాలూ బ్యాంకులు సరిగ్గా ఇవ్వకపోవడంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించి అప్పుల పాలవుతూ ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునే వరకు రైతన్నలు కష్టాలు ఎదుర్కొంటూనే ఉన్నారు. అందరి ఆకలి తీర్చే అన్నదాత ఆకలితో అలమటిస్తూ ప్రాణం పోగొట్టుకుంటున్నా పాలకులు కనికరించడం లేదు.

రాష్ట్ర వ్యాప్తంగా వరి, పత్తి, మిరపకాయ, ఆరుతడి పంటలు, పసుపు, చెరుకు, పండ్లు, కూరగాయలు, సుబాబుల్, జామాయిల్, పామాయిల్ పంటలను సాగు చేస్తున్నారు. రైతులు పంట సాగు చేసే దశలోనే నాసిరకం విత్తనాలతో నష్టపోతున్నారు. ఆపై ఎరువులు, పురుగుల మందులకు వేలాది రూపాయలు ఖర్చు పెడుతున్నారు. ఇందులోను నకిలీలతో నష్టపోతున్నారు. ఎకరాకు 50 నుంచి 70 వేల రూపాయలకు పెట్టుబడులు పెట్టాక.. వచ్చిన దిగుబడి పంటను మార్కెట్లో అమ్ముకుంటే పెట్టుబడులే వెళ్లని పరిస్థితి. కోత మిషన్లు, రవాణా చార్జీలు, హమాలీ, గుమస్తా చార్జీలు అంతా రైతుపైనే వేయడం వల్ల ఆ భారం మొత్తం మోయాల్సి వస్తుంది. దీంతో పెట్టిన పెట్టుబడి వెళ్లగా అప్పుల పాలవుతున్నారు. దీంతో పధాన డిమాండ్లపై తీర్మానం చేసి వాటి అమలు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేనున్నారు. మూడు వ్యవసాయ వ్యతిరేక చట్టాలను రద్దు చేసే వరకు సాగిన సుదీర్ఘ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తు ఉద్యమాలకు నాంది పలకనున్నారు. ఈ నేపథ్యంలో జరిగే ఈ రైతు మహాసభకు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది.

నేటి నుండి గోల్కొండ నృత్యోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ వారసత్వ సంపదగా యూనిసెఫ్‌చే గుర్తింపబడిన గోల్కొండ పేరుతో రెండురోజులు విఖ్యాత నృత్య కళాకారులతో నృత్యోత్సవం ఉంటుందని, సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి బోనాల తెలిపారు. రెండు రోజులు పాటు శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై నవంబర్ 26 నుంచి జరిగే కార్యక్రమానికి విశిష్ట అతిధులుగా పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా నేషనల్ సెక్రటరీ వై బాబ్జీ, తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ, ప్రముఖ కూచిపూడి నర్తకి, డాక్టర్ పి.రమాదేవి, దేవదాసి డ్యాన్స్ ఫెస్టివల్ డైరెక్టర్, ఒడిశా శ్రీ జగబంధు జన హాజరవుతున్నారని కిరణ్మయి బోనాల మీడియాకు చెప్పారు. అదేవిధంగా న్యూఢిల్లీ కథక్ నృత్య కారిణి పద్మశ్రీ శోవనా నారాయణ్, కేరళకు చెందిన కూచిపూడి నర్తకి అనుపమ మోహన్, ఝార్ఖండ్ ప్రత్యేక నృత్యశైలి పురులియా చ్చౌ లో దిట్ట పరేష్ ప్రసాద్ పారిట్, కథాకళి, మణిపురిలలో ప్రముఖులు అయిన అంగ్షుమన్ గుప్తా లతో పాటు సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ విద్యార్థుల బృందంచేత ప్రత్యేక కూచిపూడి ప్రదర్శన ఉంటాయి. రెండవ రోజు పేరుగాంచిన జాతీయ స్థాయి నృత్య కళాలరులు పాల్గొంటారని గోల్కొండ డ్యాన్స్ ఫెస్టివల్ ఛైర్మన్, "దీ డాన్స్ ఇండియా" సాంస్కృతిక మాస పత్రిక ముఖ్య సంపాదకులు బి.ఆర్.విక్రమ్ కుమార్ తెలియ జేశారు. ఎటువంటి ప్రవేశ రుసుము లేని ఈ డాన్స్ ఫెస్టివల్ కు అందరూ ఆహ్వానితులే అని ఫెస్టివల్ ఛైర్మన్ విక్రమ్ కుమార్ తెలియజేసారు. ఈ నృత్యోత్సవ వేదికపై కళ్యాణ్ శ్రేష్ఠ నేషనల్ అవార్డును సెంట్రల్ సంగీత నాటక్ అకాడెమీ అవార్డీ ప్రొఫెసర్ పసుమర్తి రామలింగ శాస్త్రికి, మరో ముగ్గురికి గోల్కొండ ఎక్సెలెన్స్ , ఒకరికి గోల్కొండ యువ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ ఫౌండర్ ఛైర్ పర్సన్ పద్మా కళ్యాణ్ ప్రకటించారు.

తొలిమెట్టుపై టాస్క్‌ఫోర్సును ఉపసంహరించుకోవాలి

- తపస్, డిటిఎఫ్, టిఎస్‌టియు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశపెట్టిన తొలిమెట్టు కార్యక్రమాన్ని పర్యవేక్షించడం కోసం జిల్లా అకడమిక్ టాస్క్‌ఫోర్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని తపస్, డిటిఎఫ్, టిఎస్‌టియు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆయా సంఘాల రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ఎం సోమయ్య, మహమ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శులు నవాత్ సురేష్, టి లింగారెడ్డి, చందూరి రాజిరెడ్డి శుక్రవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ప్రతి పాఠశాలలో విద్యాబోధన ప్రశాంత వాతావరణంలో నిరంతరాయంగా జరగాలని తెలిపారు. కానీ మెజార్టీ పాఠశాలల్లో ఒక్కరూ లేదా ఇద్దరు ఉపాధ్యాయులతో బోధన సాగుతున్నదని పేర్కొన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 18 సబ్జెక్టులకు బోధన చేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తొలిమెట్టు కార్యక్రమాన్ని తీసుకుని కేవలం ఉపాధ్యాయులనే దోషులుగా నిలబెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. విద్యారంగంలో నెలకొన్న సంస్థాగత లోపాలను సరిచేయాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణాధికారి పోస్టులను నింపాలనీ, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుండా పాఠశాలల పర్యవేక్షణ పేరుతో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

టాస్క్‌ఫోర్స్ కమిటీ ఉత్తర్వులను రద్దు చేయాలి : మంత్రి సబితకు టిపిటియు వినతి

ఎఫ్‌ఎల్‌ఎన్ పర్యవేక్షణ కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటు కోసం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని టిపిటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని శుక్రవారం ఆ సంఘం అధ్యక్షులు ఎం రాధాకృష్ణ, నాయకులు భూపతి శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలనీ, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కొత్త స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయండి

అధికారులను ఆదేశించిన సిఎస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కొత్త సభ్యులతో నూతన స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో ఆ బృందాల పనితీరుపై సీఎస్ సమీక్షించారు. ఈ సమావేశానికి ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ రఘునందన్‌రావు, జిహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ సత్యనారాయణ, సెర్ప్ డైరెక్టర్ వైఎన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ శృతి ఓఝా, శ్రీనిధి ఎమ్‌డీ విద్యాసాగర్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో ప్రస్తుతమున్న 6,06,000 స్వయం సహాయక బృందాలలో 64 లక్షల మంది సభ్యులున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 4,30,785 బృందాలలో 46లక్షలకుపైగా సభ్యులుండగా, పట్టణ ప్రాంతాల్లో ఉన్న 1,76,623 బృందాల్లో దాదాపు 18 లక్షల మంది సభ్యులున్నారని వెల్లడించారు. గ్రామాలు, పట్టణాలలో గ్రూపుల్లో చేరని సభ్యులను గుర్తించి కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలని కోరారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌హెచ్‌జీ గ్రూపులు, సభ్యుల వివరాలను పూర్తి స్థాయిలో అప్–డేట్ చేయాలనీ, సభ్యులందరికీ క్యూఆర్ కోడ్ కలిగిన ప్రత్యేక గుర్తింపు కార్డు జారీ చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం బ్యాంకుల ద్వారా పొందుతున్న వడ్డీ లేని రుణాల మొత్తాలను ఉత్పాదక రంగాలలో ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వయం సహాయక బృందాల సభ్యులకు వివిధ రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించడం ద్వారా వారి ఆదాయమార్గాలను పెంపొందించేందు చర్యలు తీసుకోవాలని కోరారు.



చదువుతోపాటు సామాజిక అంశాలు

గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలు నేర్చుకోవాలని ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ వినుకొండ తిరుమలి, గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలి ఆధ్వర్యంలో బాలల దినోత్సవ ముగింపు కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాలయాలు కేవలం విద్యార్థులను మరబొమ్మలుగానే చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు సమాజంలో నడుచుకోవాల్సిన విధానాలపై ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరపాలని నిర్వాహకులకు సూచించారు. భగత్‌సింగ్, గాంధీ, ఇతర స్వతంత్ర సమరయోధుల వేషధారణతో చిన్నారులు ఆకట్టుకున్నారని తెలిపారు. అనంతరం బాల, బాలికలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

హింస లేని సమాజ స్థాపన కోసం కృషి చేయాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హింస లేని సమాజ స్థాపన కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. నవంబర్ 25న హింస వ్యతిరేక దినోత్సవం నుంచి డిసెంబర్ పదిన జరిగే మానవ హక్కుల దినోత్సవం వరకు ఐద్వా ఆధ్వర్యంలో సెమినార్లు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాక్షి శ్రీజూనియర్ కళాశాలలో 'హింస లేని సమాజ స్థాపన' అంశంపై ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు ఏలుగూరి జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో లక్ష్మి మాట్లాడారు. సమాజంలో స్త్రీలు పురుషులతో సమానంగా చదువుతూ, అన్ని రంగాల్లో పనిచేస్తూ ముందుకు పోతున్నా ఇంకా వివక్ష కొనసాగడం దుర్మార్గమన్నారు. స్త్రీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా హింస ఎదుర్కొంటున్నారన్నారు. నూటికి 40 శాతం మంది స్త్రీలు గృహహింస ఎదుర్కొంటున్నారని ఐక్యరాజ్యసమితి గణాంకాలు తెలుపుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి సంవత్సరం హింస వ్యతిరేక దినోత్సవాన్ని స్త్రీల హక్కుల పరిరక్షణ దినంగా పాటించాలన్నారు. మహిళలు, పిల్లలపై దాడులు, హత్యలు, లైంగికదాడులు, హింస పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. కర్ణాటక, బీహార్, అస్సాం, తెలంగాణ, మిజోరాం, నాగాలాండ్ రాష్ట్రాల్లో గృహహింస రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. హింస లేని సమాజాన్ని తీసుకురావడం కోసం ప్రభుత్వాలు తమ మేనిఫెస్టోలో సరైన విధానాలను పొందుపరచాలని కోరారు. ప్రభుత్వ విధానాల్లో, పురుషుల ఆలోచనా విధానాల్లో మార్పులు వచ్చినప్పుడు మాత్రమే హింసలేని సమాజాన్ని స్థాపించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. విద్య, క్రీడలు, సైన్స్ రంగాల్లో మహిళలు ముందుకు పోతున్నప్పటికీ ఇంకా ఒదిగి ఉండాలనే పితృస్వామ్య భావజాలాన్ని కొనసాగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. మహిళల హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్‌లో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతు దేశానికి ఆదర్శం

వెసులుబాటు కాగానే రుణమాఫీ చేస్తాం : మంత్రి నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతు దేశానికి ఆదర్శమని, రైతు కేంద్రంగా సగర్వంగా రాష్ట్రం నడుస్తుందని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం జింకలతండా వద్ద రూ.14.90 కోట్లతో నిర్మించిన 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 3 గోదాముల సముదాయాన్ని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గోదాముల నిర్మాణం చేపట్టిందన్నారు. దేశంలో ఎక్కడా గోదాముల నిర్మాణం జరగట్లేదన్నారు. ఒక్క రాష్ట్రంలోనే వాటి ప్రాముఖ్యత గుర్తెరిగి నిర్మిస్తున్నట్టు అన్నారు. యాసంగి రైతుబంధు డిసెంబర్‌లో రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. రుణమాఫీని రూ.36 వేల వరకు చేశామని, అమలులో ఉన్న సంక్షేమ పథకాలు వేటినీ ఆపలేదని అన్నారు. కొంత వెసులుబాటు కాగానే రుణమాఫీ మొత్తం చేయనున్నట్టు తెలిపారు. జిల్లా ప్రజాపరిషత్ చైర్మెన్ లింగాల కమల్‌రాజ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ వేద సాయిచందర్, కలెక్టర్ గౌతమ్, డిసిసిబి చైర్మెన్ నాగభూషణం, మేయర్ నీరజ, సుడా చైర్మెన్ విజయ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మెన్ లక్ష్మి ప్రసన్న, ఎంపిపి గౌరీ, జడ్‌పిటిసి ప్రియాంక, వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మోటో వాల్డ్ 50 షోరూంల విస్తరణ లక్ష్యం

ఆదిశ్వర్ ఆటోరైడ్ ఎండి వెల్లడి

హైదరాబాద్ : మహావీర్ గ్రూపులో భాగమైన మల్టీ బ్రాండ్ సూపర్ బైకుల తయారీ, విక్రయాలను చేసే ఆదిశ్వర్ ఆటో రైడ్ ఇండియా.. వచ్చే ఆర్థిక సంవత్సం ముగింపు నాటికి 50 మోటో వాల్డ్ షోరూంలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.



హైదరాబాద్‌లో శుక్రవారం మూడు కొత్త బ్రాండ్‌లతో మోటో వాల్డ్ సూపర్ బైక్ షోరూంను ఆదిశ్వర్ ఆటో రైడ్ ఇండియా ఎండి వికాస్ జబఖ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బ్రాండ్‌లు మోటో మోరిని, జోన్‌ల, క్యూజె మోటర్‌లోని పలు మోడళ్లను ఆవిష్కరించారు. ప్రస్తుతం తమకు పలు నగరాల్లో తొమ్మిది అవుట్‌లెట్‌లు ఉన్నాయని వికాస్ మీడియాకు తెలిపారు. హైదరాబాద్ సమీపంలోని పోచంపల్లిలో అసెంబ్లింగ్ యూనిట్ ఉందన్నారు. ఈ ప్లాంట్ కోసం రూ.50 కోట్ల పెట్టుబడి పెట్టామన్నారు. ఇక్కడ ప్రస్తుతం వంద మంది ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. తమ సూపర్ బైకు అమ్మకాల్లో 20 శాతం వృద్ధిని నమోదు చేస్తున్నామన్నారు. ఈ రంగంలో విస్తృతావకాశాలున్నాయన్నారు.

త్వరలో ఐపిఒకు ధర్మజ్ క్రాప్ గార్డ్

హైదరాబాద్ : వ్యవసాయ రసాయనిక సంస్థ అయినా ధర్మజ్ క్రాప్ గార్డ్ లిమిటెడ్ త్వరలో ఐపిఒకు రానున్నట్లు ప్రకటించింది. 2022 జూలై నాటికి 219 కంటే ఎక్కువ సంస్థాగత ఉత్పత్తులని కలిగి ఉన్నట్లు పేర్కొంది. తన ఉత్పత్తులను 25 దేశాలలో 60 మందికి పైగా వినియోగదారులకి ఎగుమతి చేస్తున్నట్లు తెలిపింది. దేశంలో 16 స్టాక్ డిపోలు, 4,200 మంది డీలర్లతో కూడిన నెట్వర్క్ ద్వారా 17 రాష్ట్రాల్లో విక్రయిస్తున్నట్లు పేర్కొంది. 2021–22లో రూ.396 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసినట్లు తెలిపింది.

హోసూర్‌లో ఎథర్ ఎనర్జీ కొత్త ప్లాంట్

బెంగళూరు : విద్యుత్ వాహనాల స్కూటర్ బ్రాండ్ ఎథర్ ఎనర్జీ తమ రెండవ తయారీ కేంద్రాన్ని తమిళనాడులోని హోసూర్‌లో ప్రారంభించింది. 3 లక్షల చదరపు అడగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌తో కంపెనీ తయారీ సామర్థ్యం ఏడాదికి 4.20 లక్షల యూనిట్లకు చేరనుందని తెలిపింది. అదే విధంగా తమ ప్రతిష్టాత్మక స్కూటర్లు 450 ఎక్స్, 450 ప్లస్ కోసం పెరుగుతున్న డిమాండ్ అవసరాలను సైతం తీర్చనుందని పేర్కొంది.